క్లుప్తంగా

నేడు సీతారాముల కల్యాణోత్సవం

ఉదయగిరి: మండలంలోని దేకూరుపల్లిలో శనివారం రాత్రి సీతారాముల కల్యాణ మహోత్సవం జరుగుతుందని నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం గ్రామోత్సవం జరుగుతుందన్నారు. ఆదివారం స్వామివారి గ్రామోత్సవం, వసంతోత్సవం, పార్వేట కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

అరుణాచలం గిరిప్రదక్షిణకు ప్రత్యేక బస్సు

కావలి: కావలి ప్రాంత ప్రజల కోరిక మేరకు ప్రతి పౌర్ణమికి అరుణాచలం గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తులు, యాత్రికుల సౌకర్యార్థం మే 4న ప్రత్యేక బస్సును ఏర్పాటు చేశామని కావలి ఆర్టీసీ డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ బస్సు మే 4న ఉదయం 8 గంటలకు కావలిలో బయలుదేరి రాత్రికి అరుణాచలం చేరుతుందని, గిరిప్రదక్షిణ అనంతరం తిరిగి బయలుదేరి 6వ తేదీ సాయంత్రానికి కావలికి వస్తుందన్నారు. ఈ సర్వీస్‌కు సీట్ రిజర్వేషన్ చేయడం ప్రారంభించామన్నారు.

డిప్యూటీ కలెక్టర్ సచివాలయాల సందర్శన

ఆత్మకూరురూరల్: మండలంలోని వాశిలి, కరటంపాడు సచివాలయాలను ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మహేష్ శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో విధి నిర్వహణకు సంబంధించి పలు అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులు పరిశీలించి తగు సూచనలు జారీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో వీఆర్‌ఓలు ప్రతాప్, పెంచలయ్య, పంచాయతీ కార్యదర్శులు పర్వీన్, ఎల్‌వీ ప్రసాద్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

3న ఆలయ నిర్మాణానికి భూమి పూజ

ఉదయగిరి: మండలంలోని గండిపాళెంలో నూతనంగా నిర్మించనున్న అంకాళమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి మే 3వ తేదీ భూమి పూజ జరుగుతుందని నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

5న మహా అన్నాభిషేక మహోత్సవం

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం సిద్ధేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని మహా శివలింగానికి మే 5న వైశాఖ మాస పౌర్ణమి సందర్భంగా అన్నాభిషేక మహోత్సవం జరుగుతుందని ఆలయ అర్చకులు ఎల్‌వీ ప్రసాద్‌శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 4 గంటల నుంచి జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నాభిషేకాన్ని తిలకించి పరమ శివుడి అనుగ్రహం పొందాలన్నారు. పూజలో పాల్గొనే భక్తులు పూజా సామగ్రితో రావాలన్నారు. అన్నాభిషేకానికి బియ్యం ఇవ్వదలచిన భక్తులు 3వ తేదీలోపు అందజేయాలన్నారు.

ఉచిత వైద్యశిబిరం



దుత్తలూరు: స్థానిక విశ్వభారతి సేవాసంస్థ ఆధ్వర్యంలో నెల్లూరు ఎమెల్ హాస్పిటల్ సహకారంతో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వభారతి సేవాసంస్థ అధ్యక్షుడు నర్రావుల పుల్లారెడ్డి, వైద్యులు దావూద్, శ్రీహర్ష, విశ్వభారతి సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

అమ్మవారి జ్యోతికి ఘన స్వాగతం



జ్యోతికి స్వాగతం పలుకుతున్న మహిళలు

కావలి: ఆర్యవైశ్యుల కులదైవం వాసవీ కన్యకా పరమేశ్వరి జన్మదినం సందర్భంగా పెనుగొండ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జన్మస్థలం పెనుగొండ దేవస్థానం నుంచి చెన్నై వరకు జ్యోతి బయలుదేరిన సందర్భంగా కావలిలో మహిళలు జ్యోతికి, వాసవి అమ్మవారికి ఘన స్వాగతం పలికారు.

వాహనాల దారి మళ్లింపు

ఆత్మకూరు: ఆత్మకూరులోని మున్సిపల్ బస్టాండ్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్న నేపథ్యంలో బస్టాండ్ ప్రాంతంలో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు మొదలు పెట్టినట్లు ఇన్‌చార్జి కమిషనర్ జే ప్రసాద్ శుక్రవారం తెలిపారు. రోడ్డు నిర్మాణ పనులు సజావుగా సాగేందుకు ఆ మార్గంలో వాహనాలను దారి మళ్లించి హిల్ రోడ్డు, బాలికల పాఠశాల మీదుగా పట్టణంలోకి ప్రవేశించేలా నిర్ణయించినట్లు, ప్రజలు, వాహనదారులు సహకరించాలని ఆయన కోరారు. శనివారం నుంచి వచ్చే నెల 7వ తేదీ ఆదివారం వరకు ఈ మార్గంలో వాహనాల రాకపోకలు నిలిపివేయనున్నట్లు జరుగుతున్న ఇబ్బంది దృష్ట్యా ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

అంతా రహస్యం

- మోడల్ స్కూల్లో ఏం జరుగుతోంది?
- బాలికల హాస్టల్ అవుట్‌సోర్సింగ్ వార్డెన్ గదిలోకి అర్ధరాత్రి పూట బయట వ్యక్తి చొరబాటు
- విద్యార్థినుల సమాచారంతో పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న వైనం
- అవుట్‌సోర్సింగ్ వార్డెన్ విధుల నుంచి తొలగింపు
- ఐదు నెలలుగా విడతల వారీగా వివిధ స్థాయిల్లో అధికారుల విచారణ
- బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు



నందవరంలోని ఏపీ మోడల్ స్కూల్

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు మండలం నందవరంలో ఉన్న ప్రభుత్వ ఆదర్శ పాఠశాల సుమారు 500 మంది విద్యార్థులతో తలమానికంగా ఉంది. బోధనాపరంగా.. ఉత్తీర్ణత పరంగా నందవరం మోడల్ స్కూల్ గొప్ప ఫలితాలు సాధిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందింది. అయితే గతేడాది డిసెంబరు 7న జరిగిన ఓ ఘటన విషయంలో మాత్రం విద్యాశాఖ అధికారులు అనుసరిస్తున్న వైఖరి అనేక ప్రశ్నలకు తావిస్తోంది. ఆరు నుంచి 12 తరగతుల వరకు విద్యార్థులు ఈ పాఠశాలలో చదువుకోవడానికి తమ తమ గ్రామాల నుంచి నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. బాలికలకు మాత్రం ప్రభుత్వం తరఫున ఈ ప్రాంగణంలో హాస్టల్ ఉంది. 16 మంది రెగ్యులర్ అధ్యాపకులు, పది మంది అవుట్ సోర్సింగ్, నలుగురు కాంట్రాక్ట్ ఉద్యోగులు ఈ పాఠశాలలో పని చేస్తున్నారు.

నందవరం మోడల్ స్కూల్ ప్రాంగణంలో ఉన్న వార్డెన్‌గా అవుట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఓ మహిళా ఉద్యోగిని గదిలోకి అర్ధరాత్రి బయట వ్యక్తి చొరబడడంతో విద్యార్థులు గమనించి పోలీసులకు, తమ తల్లిదండ్రులకు సమాచారం అందించారు. దీంతో మర్రిపాడు పోలీసులు రంగ ప్రవేశం చేసి చొరబడిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. అయితే ఈ ఘటన జరిగిన నెల రోజులకు జిల్లా విద్యాశాఖ అధికారులు, కావలి డిప్యూటీ డీఈఓ విచారణ జరిపారు. అవుట్ సోర్సింగ్ పద్ధతిపై వార్డెన్‌గా విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగిని తాత్కాలికంగా విధుల నుంచి తప్పించారు. దీంతో ఈ పాఠశాలలో పని చేసే మహిళా ఉపాధ్యాయులే విడతలు వారీగా డ్యూటీలు వేసుకుని బాలికల హాస్టల్ వార్డెన్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఐదు నెలలుగా బాలికల హాస్టల్‌కు రెగ్యులర్ వార్డెన్ నియమించకుండా విద్యాశాఖ అధికారులు కాలయాపన చేయడంపై విద్యార్థినుల తల్లిదండ్రులు, పాఠశాల విద్యార్థులు ఒక వైపు ఆందోళన చెందుతుంటే రెండో సారి నాలుగు నెలల తర్వాత గురువారం ఇదే పాఠశాలలో గతంలో జరిగిన ఘటనపై జిల్లా సమగ్ర శిక్షా ఏపీసీ ఉషారాణి, నెల్లూరు డైట్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు బృందం సుమారు రెండు గంటల పాటు అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులతో విచారణ జరిపారు. అనంతరం విచారణాధికారిగా వచ్చిన ఏపీసీ ఉషారాణిని విలేకరుల వివరాలు కోరితే ఎలాంటి స్పందన లేకుండా విచారణ గది నుంచి బయటకు వచ్చి తన కారులో ఎక్కి కూర్చున్నాను. వెనుకనే వస్తున్న మరో విచారణ అధికారి డైట్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లును సంప్రదిస్తే అన్ని కోణాల నుంచి విచారించి తదుపరి చర్యలు తీసుకుంటామని రెండు ముక్కల్లో బదులిచ్చారు. మరో రెండు రోజుల్లో విద్యా సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో ఇప్పటికే పదో తరగతి, ఇంటర్ పరీక్షలు పూర్తయ్యి విద్యార్థినులు అంతా ఇళ్లకు వెళ్లిన క్రమంలో 8, 9 తరగతులకు చెందిన 9 మంది విద్యార్థులు మాత్రమే పాఠశాలలో ఉండగా హడావుడిగా రెండో సారి విచారణకు వచ్చిన అధికారులు అంతే హడావుడిగా వచ్చిన కారులోనే వెనుతిరిగి వెళ్లడం పలు అనుమానాలకు తావిస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ఈ వ్యవహారంపై బాధ్యులపై చర్యలు తీసుకునే విషయంతో పాటు భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలకు తావు ఇవ్వకుండా చర్యలు చేపట్టే విషయంపై విద్యాశాఖ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. వెనుక నుంచి నడిపే అదృశ్య శక్తుల ప్రమేయంతో దోషులను కాపాడేందుకు ఒక వర్గం తమ సర్వశక్తులు ఒడ్డుతున్నారని గుసగుసలు కూడా వినిపిస్తున్నాయి. విద్యాపరంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నందవరం మోడల్ స్కూల్‌లో జరుగుతున్న పరిణామాలు సర్వత్రా విమర్శలకు, అనుమానాలకు, ఆందోళనలకు తావిస్తున్నాయి. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ హరినారాయణన్ దృష్టి సారించి సమగ్ర దర్యాప్తు జరిపి దోషులపై చర్యలు తీసుకోవాలని, మోడల్ పాఠశాల విద్యాపరంగా ఉన్న ప్రతిష్టను కాపాడాలని వందలాది మంది విద్యార్థుల తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

అందరికీ ఇళ్లు ప్రభుత్వ లక్ష్యం

అనుమసముద్రంపేట: అందరికీ జగనన్న కాలనీలు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని హౌసింగ్ డీఈ నటరాజన్, తహసీల్దార్ సుభద్ర అన్నారు. శుక్రవారం జగనన్న ఇళ్ల లబ్ధిదారులు తెల్లపాడు వద్ద మాకు స్థలాలు వద్దంటూ ఏఎస్‌పేట సచివాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. సచివాలయానికి వచ్చిన అధికారులు మాట్లాడుతూ ప్రస్తుతం ఏఎస్‌పేటకు అతి సమీపంలోనే తెల్లపాడు ఉందని, స్థలాలు తీసుకున్న లబ్ధిదారులు ఇళ్లు కట్టుకునేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని తెలిపారు. ఇతరుల మాటలు నమ్మి ఆందోళనకు దిగవద్దని వారు లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. పట్టాలు పొందిన ప్రతి ఒక్కరూ ఇంటి పనులు ప్రారంభిస్తే వసతులను సైతం గృహ నిర్మాణశాఖ చూసుకుంటుందని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ఆత్మకూరురూరల్: మండలంలోని నువ్వూరుపాడు, దేపూరు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై ఆశాఖ అధికారులు, సిబ్బంది శుక్రవారం ర్యాలీ నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా రైతులు సాగు చేసుకోవాల్సిన పంటలు, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు వివరించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ సుబ్బమ్మ, వీఆర్‌సీ నాగరాజు, ఐసీఆర్‌పీ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

గ్రామాల సమగ్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



భూమిపూజ చేస్తున్న దృశ్యం

దుత్తలూరు: గ్రామాల సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ చేజర్ల జయంత్‌రెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం మండలంలోని తిమ్మాపురం, తెడ్డుపాడు, సోమలరేగడ, చింతలగుంట గ్రామాల్లో నూతన సిమెంటు రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి సచివాలయానికి రూ.20 లక్షల నిధులు కేటాయించారన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై నివేదిక ఏర్పాటు చేసి ప్రస్తుతం అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. అనంతరం బ్రహ్మేశ్వరంలో భూరక్ష పథకం ద్వారా మంజూరైన పట్టాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ చేజర్ల చలమారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు వాసిపల్లి వెంకటేశ్వరరెడ్డి, ఎంపీడీఓ సాయిప్రసాద్, నాయకులు శ్రీహరినాయుడు, మచ్చా నాగేశ్వరరావు, పెద్దిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వాసిపల్లి కృష్టారెడ్డి, రామిరెడ్డి, దయాకర్, కామేశ్వరరెడ్డి, మీసాల సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల కమిటీ సమావేశాలు నిర్వహించాలి

ఉదయగిరి: మండలంలోని అన్ని పాఠశాలల్లో శనివారం పేరెంట్స్ కమిటీ సమావేశాలు తప్పనిసరిగా నిర్వహించాలని ఎంఈఓ షేక్ మస్తాన్‌వలి అన్నారు. ఆయన శుక్రవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేరెంట్స్ కమిటీ సమావేశంలో విద్యార్థుల ప్రతిభ, వార్షిక ప్రగతిని తల్లిదండ్రులకు వివరించి ప్రగతి కార్డులు అందజేయాలన్నారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తల్లిదండ్రులకు వివరించాలన్నారు. జూన్ 5వ తేదీలోపు నాడు-నేడు పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ అలీం, సీఏ వశీం పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

ఉదయగిరి: ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యసిబ్బంది వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ అన్నారు. ఆయన శుక్రవారం మండలంలోని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన వైద్యశాలలోని వసతులు, అందుతున్న సేవలు మందుల వివరాలను వైద్యాధికారిణి శివకల్పనను అడిగి తెలుసుకున్నారు. వైద్యశాలలోని ఖాళీ ప్రదేశంలో పండ్లు, పూలమొక్కలు పెంచేలా చూడాలని సూచించారు. ఆయన జగన్న లేఅవుట్లను, వెంగళరావునగర్ గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి గాజులపల్లి అమర్‌నాథ్‌రెడ్డి, రెవెన్యూ కార్యదర్శి బిల్లుపాటి వెంకటేశ్వర్లు సీఏ గాజుల ఇమ్రాన్ తదితరులున్నారు.

ఈ క్రాప్ నమోదు చేసుకోవాలి

చేజర్ల: రెండో పంట వేసిన రైతులు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని పొదలకూరు సబ్ డివిజన్ ఏడీఏ శివనాయక్ చెప్పారు. శుక్రవారం చేజర్లలోని వ్యవసాయశాఖాధికారి కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ యాంత్రీకరణపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కొత్తగా పాస్‌బుక్‌లు వచ్చిన వారు, కొత్తగా పొలం కొన్న రైతులు రైతు భరోసాకు నమోదు చేసుకోవాలన్నారు. పీఎం కిసాన్ కోసం రైతులు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శశిధర్, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

జగనన్న సంక్షేమ క్యాలెండర్ ఆవిష్కరణ

అల్లూరు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీదేవి ఆధ్వర్యంలో 2023–24 సంవత్సరానికి సంబంధించి జగనన్న సంక్షేమ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డీ వీరేంద్ర, పంచాయతీ కార్యదర్శులు వరప్రసాద్, హజరత్‌బాబు, సుజాత, రామారావు, మురళీకృష్ణ, సిద్ధేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లకు విద్యార్థులు

సంగం: ప్రభుత్వం పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించడంతో సంగం గురుకుల పాఠశాల విద్యార్థులు శుక్రవారం తమ ఇళ్లకు బయలుదేరారు. తల్లిదండ్రులు తమ పిల్లలను దగ్గరుండి ఇళ్లకు తీసుకెళ్లారు. విద్యార్థులను ఆటోలు, బైక్‌లు, బస్సుల్లో తీసుకెళ్లేందుకు తల్లిదండ్రులు రావడంతో ఆ ప్రాంతంలో సందడి వాతావరణం నెలకొంది. తిరిగి జూన్‌లో పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి.

అనాథాశ్రమం వార్షికోత్సవం

సీతారామపురం: మండలంలోని బసినేనిపల్లిలో మంచికంటి సుబ్బరామ ప్రసాద్‌గుప్త అనాథాశ్రమంలో శుక్రవారం ఐదో వార్షికోత్సవం నిర్వహించారు. అనాథలకు ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. అందరికీ భోజన వసతి ఏర్పాటు చేశారు. ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి మాట్లాడుతూ మంచికంటి సుబ్రహ్మణ్యం తన కుమారుడి జ్ఞాపకార్థం అనాథాశ్రమం ఏర్పాటు చేసి ఎంతోమంది అనాథలకు నీడ కల్పించడం అభినందనీయమన్నారు. మండల కన్వీనరు చింతంరెడ్డి సుబ్బారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు బసిరెడ్డి కృష్ణారెడ్డి, బాలసుబ్రహ్మణ్యం, ఉమాదేవి, వేముల రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

కలుషిత తాగునీరు సరఫరా

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని ఎల్‌ఆర్‌పల్లి, జేఆర్‌పేట ప్రాంతాల్లో రెండు రోజులుగా కలుషితమైన తాగునీరు సరఫరా అవుతుండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గురు, శుక్రవారాల్లో మున్సిపల్ కుళాయిల ద్వారా నీరు సరఫరా అయిందని పలువురు మహిళలు తెలిపారు. తాగునీటి నిర్వహణ కేంద్రంలో ఆలం (శుద్ధి పటిక) కలపడంలో సిబ్బంది నిర్లక్ష్యంతో ఇలా జరిగి ఉంటుందని పలువురు ఆరోపించారు. ఈ విషయమై మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ ప్రసాద్‌ను సంప్రదించగా కలుషిత నీరు సరఫరా అయిందని వాస్తవమేనని, సమస్యను పరిష్కరిస్తున్నట్లు, శనివారం నుంచి శుద్ధమైన తాగునీరు ప్రజలకు సరఫరా చేయనున్నట్లు ఆయన తెలిపారు.

నేడు జవహర్ నవోదయ ఎంట్రన్స్

ఆత్మకూరు: జవహర్ నవోదయ విద్యాలయ ఎంట్రన్స్ పరీక్ష శనివారం ఉదయం 11.30 నుంచి ఒకటిన్నర వరకు జరగనున్నట్లు ఎగ్జామినేషన్ సెంటర్ చీఫ్ తోట శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆయన శుక్రవారం మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో 182 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రంలో జరిగే పరీక్షకు ఉదయం 9.30 గంటల నుంచి విద్యార్థులను అనుమతించనున్నట్లు, హాల్‌టికెట్లు తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

జలదంకి: జలదంకి తహసీల్దార్ కార్యాలయంలో చలివేంద్రాన్ని సోమవారం శిక్షణ కలెక్టర్ విద్యాధరి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే వారికి తాగునీరు అందించేందుకు ఈ చలివేంద్రం ఉపయోగపడుతుందన్నారు. తహసీల్దార్ సీహెచ్ పద్మావతి, డీటీ భరత్, ఆర్ఐ శ్రీజ, వీఆర్వోలు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తగిలి గేదె మృతి

చేజర్ల: విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా గేదె మృతి చెందింది. మూడు రోజుల క్రితం విద్యుత్ లైన్ తెగిపడినా విద్యుత్ సిబ్బంది పట్టించుకోకపోవడంతో ఈ ఘటన జరిగింది. చేజర్ల మండలం కోటితీర్థంలో మూడు రోజుల క్రితం పెన్నానది ఒడ్డున (దొంగ రేవు గడ్డ) విద్యుత్ లైన్ (ఎల్‌టీలైన్) తెగి పడింది. రైతులు విద్యుత్ సిబ్బందికి తెలిపినప్పటికీ లైన్ పునరుద్ధరించకపోవడంతో శుక్రవారం పాడి గేదె తెగిపడిన విద్యుత్ తీగలు తగిలి మృతి చెందింది.

బాధితురాలికి వస్తువుల పంపిణీ

జలదంకి: అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితురాలికి జలదంకి రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో శుక్రవారం జలదంకికి చెందిన కుంచాల మానసకు వస్తువులు అందించారు. దీంతో జలదంకి రెడ్‌క్రాస్ సభ్యులు రెడ్‌క్రాస్ మాజీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి సహకారంతో మానసకు తక్షణ అవసరాలైన వంట పాత్రలు, దోమతెరలు, దుప్పట్లు, సబ్బులు ఇతర నిత్యావసరాలతో పాటు రూ.1,500 అందించారు. ఈ కార్యక్రమంలో మండల రెడ్‌క్రాస్ అధ్యక్షుడు వడ్డే శ్రీనాథ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు గోసు ప్రసాద్, కోశాధికారి పువ్వాడి సురేష్ కుమార్, కార్యదర్శి అతికపల్లి వివిత్ కుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబరు ఏగూరి రఘు, ఫయాజ్ పాల్గొన్నారు.

పేదలకు అండగా జగనన్న ప్రభుత్వం

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాలు బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

బిట్రగుంట: సమాజంలో అట్టడుగున ఉన్న పేదలకు అవసరమైన పథకాలు అమలు పరిచి పేదలకు అండగా ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. బోగోలు మండలం జువ్వలదిన్నె పంచాయతీ పాత కడపాళెంలో శుక్రవారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలతో మాట్లాడారు. వారి కుటుంబ పరిస్థితులు, ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు అందిన పథకాల వివరాలు తెలియజేసే బుక్‌లెట్‌లను ప్రతి కుంటుంబానికి ఎమ్మెల్యే అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కరోనా వంటి విపత్కర పరిస్థితులు వచ్చినా సీఎం జగన్ సంక్షేమ పథకాలను ఆపలేదన్నారు. ప్రజలపై నిబద్ధత ఉన్న నాయకుడిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశ వ్యాప్తంగా ప్రతిష్ఠ సంపాదించారన్నారు. అందుకే ఏ సర్వే చేసినా సీఎం జగన్ పాలనకు ప్రజలు నుంచి మద్దతు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

‘జగనన్నే మా భవిష్యత్తు’ కోలాహలం



పట్టణంలోని బాలకృష్ణారెడ్డినగర్‌లో లబ్ధిదారులకు బుక్‌లెట్స్ అందిస్తున్న నాయకులు

కావలి: కావలి నియోజకవర్గంలో ‘జగనన్నే మా భవిష్యత్తు’ కార్యక్రమంలో ప్రతి గ్రామంలో, పట్టణంలోని వార్డుల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు ప్రతి ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనపై చర్చ పెడుతుండడంతో కోలాహలంగా ఉంది. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో బోగోలు, దగదర్తి, కావలి, అల్లూరు మండలాలతో పాటు కావలి పట్టణంలో నాయకులు ఇంటింటికి వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనాదక్షతను ప్రజలకు వివరిస్తున్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల మేరకు.. మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలను నాలుగేళ్ల పరిపాలనలో 98 శాతానికి పైగా నెరవేర్చిన విషయాన్ని వివరిస్తుండడంతో ప్రజల నుంచి సంతృప్తి కనిపిస్తోంది. ఆయా కుటుంబాల సమ్మతి మేరకు ‘మా నమ్మకం నువ్వే జగన్’ అనే స్టిక్కర్లను వారి నివాసాలకు అంటించి, మెగా పీపుల్ సర్వే కోసం వారి అభిప్రాయాలను సేకరిస్తున్నారు. అనంతరం 82960 82960 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చి ప్రభుత్వానికి మద్దతు కోరగానే ప్రజలు తమ ఆమోదాన్ని సంతోషంగా తెలియజేస్తున్నారు. వెంటనే తిరుగు ఫోన్ కాల్ ద్వారా వచ్చే సీఎం జగన్ వాయిస్‌ను శ్రద్ధగా ఆలకిస్తున్నారు. సంక్షేమ పథకాల్లో జగనన్న పాలన సువర్ణ అధ్యాయమని ప్రజలు అభినందిస్తున్నారు.

రెగ్యులర్ ప్రక్రియలో మమ్మల్ని చేర్చండి

- మంత్రి ఆదిమూలం సురేష్‌కు వినతి

కావలి: రాష్ట్ర ప్రభుత్వం పలువురు ఉద్యోగులను రెగ్యులర్ చేసే క్రమంలో మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులను చేర్చాలని ఆ సంఘం కార్యవర్గ సభ్యులు రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ కమిటీ సభ్యులు ఆదిమూలం సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. కావలి పట్టణంలో పలు కార్యక్రమాలకు వచ్చిన మంత్రి ఆదిమూలం సురేష్‌ను కాంట్రాక్ట్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్ట్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. 202 నుంచి 2020 వరకు నేషనల్ హెల్త్‌మిషన్, ఆర్‌ఎన్‌టీసీపీ, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, 104, 108, బ్లడ్ బ్యాంకు, ట్రామాకేర్ తదితర వాటిలో సర్వీసును కూడా పరిగణనలోకి తీసుకుని వెయిటేజ్ మార్కులు ఇచ్చి మెరిట్ ప్రాతిపదికన తమను నియమించారని, రెగ్యులర్ ప్రక్రియలో తమను చేర్చాలని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు డి రసూల్ సాహెబ్, పవన్‌కుమార్, చంద్రమోహన్, మీరామొహిద్దీన్, నూర్జాహాన్, పద్మజ, ఉష పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు డ్రెస్‌కోడ్ తప్పనిసరి



రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ అబ్దుల్ హమీద్

వరికుంటపాడు: మండలంలోని గ్రామ సచివాలయాల సిబ్బంది తప్పనిసరిగా విధి నిర్వహణలో డ్రెస్‌కోడ్ తప్పనిసరిగా ఉండాలని తహసీల్దార్ అబ్దుల్‌హమీద్ సూచించారు. ఆయన శుక్రవారం మండలంలోని తోటలచెరువుపల్లి సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. బయోమెట్రిక్ హాజరు నూరు శాతం వేయాలన్నారు. స్పందనలో వచ్చే అర్జీలను త్వరగా పరిష్కరించాలన్నారు. మూవ్‌మెంట్ రిజిస్టర్‌ను నిర్వహించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలన్నారు. గ్రామంలో వివాదంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయ స్థలాన్ని పరిశీలించారు.

నాడు-నేడు పనులు వేగవంతం చేయాలి

చేజర్ల(సోమశిల): పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ ఎ. మధుసూదన్‌రావు ఎంఈఓ బాలకృష్ణారెడ్డి సూచించారు. అనంతసాగరం మండలం గౌరవరం ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూన్ 11వ తేదీ లోపల నాడు-నేడు పనులను పూర్తి చేయాలని ప్రధానోపాధ్యాయుడికి సూచించారు. యు లవ్ రీడింగ్ అనే వేసవి సెలవుల్లో జరిగే కార్యక్రమం గురించి విద్యార్థులకు వివరించారు. పిల్లల స్థాయిని బట్టి అన్ని రకాల లైబ్రరీ పుస్తకాలు చివరి పని రోజు అందించాలని హెచ్‌ఎంలకు ఎంఈఓ సూచించారు. హెచ్‌ఎం ప్రసాద్ పాల్గొన్నారు.

రుణాలు సక్రమంగా వినియోగించుకోండి

జలదంకి: ప్రభుత్వం అందిస్తున్న రుణాలను పొదుపు మహిళలు సక్రమంగా వినియోగించుకోవాలని ఐకేపీ ఏపీఎం శ్రీధర్‌రావు అన్నారు. శుక్రవారం మండల సమాఖ్య సభ్యులకు, వీఓఏలకు, ఓబీలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలు ఆర్థికంగా వృద్ధి చెందేందుకు గతంలో పెరటి కోళ్లు అందించామని, ప్రస్తుతం పొట్టేళ్ల యూనిట్లు అందు బాటులో ఉన్నాయని తెలిపారు. మొబైల్ బుక్ కీపింగ్‌ను వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. స్త్రీనిధి, ఉన్నతి రుణాల రికవరీపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు.

రెండు కుటుంబాల మధ్య ఘర్షణ

కలిగిరి: పరికోటలో గడ్డివాముల వేసుకునే దొడ్ల స్థలానికి సంబంధించి శుక్రవారం రెండు కుటుంబాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో ఒక కుటుంబానికి చెందిన కోటంరెడ్డి నవీన్‌కుమార్ మరో కుటుంబానికి చెందిన పర్వతరెడ్డి మణికిషోర్ గాయపడ్డారు. క్షతగాత్రులు ఇద్దరు కావలిలోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందారు. ఈ ఘటనపై ఎస్సై సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ దొడ్డుకు సంబంధించి చాలా రోజుల స్థల వివాదం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో స్థలాన్ని బాగు చేయాలనే ప్రయత్నంలో ఇరు కుటుంబాలు ఘర్షణకు దిగారన్నారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని తెలిపారు.

పందులను నివారించండి

అనుమసముద్రంపేట: పవిత్ర పుణ్యక్షేత్రం హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గా ప్రాంతంలో పందులను నివారించాలని కోరుతూ శుక్రవారం స్థానికులు పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం సమర్పించారు. భక్తులు భోజనాలు చేసే సమయంలో పందులు హల్‌చల్ చేస్తున్నాయని, చిన్నారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు ఆయన పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకొచ్చారు. పవిత్ర పుణ్యక్షేత్రం కావడం వల్ల ఎంతో మంది భక్తులు దర్గాకు వస్తుంటారని, కొంత మంది పందుల పెంపకందారులు దర్గా ప్రాంతంలో పందులు ఉండడం వల్ల దుకాణదారులకు సైతం ఇబ్బందులు కలుగుతున్నట్లు వారు తెలిపారు.

మంచి పోరాటము పోరాడితిని, నా పరుగు కడముట్టించితిని, విశ్వాసము కాపాడుకొంటిని
2 తిమోతికి 4:7

ఆదరణ స్తుతి కూడిక

తేది : 29-04-2023
స్థలం : రైల్వే ఇన్‌స్టిట్యూట్, దొనకొండ



నిర్మలమైన హృదయం, నిష్కల్మషమైన మనస్సు,
నిరాడంబరమైన మనిషి, నిస్వార్థ సేవకురాలు,
నిజమైన భక్తురాలు, నిన్న ఇహలోకంలో
మా సహవాసి... నేడు పరలోకంలో
శాశ్వత నివాసి... ఎవరు మరచి పోలేనిది
మీరు చేసిన కృషి మీ పవిత్ర ఆత్మకు
శాంతి చేకూరాలని ప్రభువును కోరుకుంటూ...

శ్రీమతి మంగల విజయకుమారి గారు
జననం : 14-10-1949   మరణం : 09-04-2023

మీ
కుటుంబసభ్యులు
మరియు బంధుమిత్రులు